వార్త

శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు సోమవారం 6 అక్టోబర్ 2025






శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 5, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 9245 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 72.508 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 0, ఎన్‌ఎఫ్‌సికి 100, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.830 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# వైకల్యం శరీరానికి మాత్రమే సంకల్పానికి కాదు

**- డీఆర్ఓ విజయ కుమార్**

**- జడ్పీలో ఘనంగా ప్రపంచ బధిరుల అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం వేడుకలు**





**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 5, ప్రభతవార్త** ప్రపంచ బధిరుల, అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవంను పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతులు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, నెల్లూరు జిల్లా బధిరుల సంఘం కలిసి సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ పాల్గొని తమ అమూల్యమైన సూచనలు సలహాలను అందజేస్తూ, వైకల్యం శరీరానికి మాత్రమేనని సంకల్పానికి కాదని వైకల్యము కలిగి జీవితములో అత్యున్నత స్థాయికి చేరిన వారి జీవితాలను ఆదర్శముగా తీసుకొని తమ జీవితములో ముందుకు సాగాలని తెలియజేసియున్నారు ఈ శాఖ సహాయ సంచాలకులు ఏయండి మహమ్మద్ అయూబ్ జిల్లాలోని అందరు బధిరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ జీవితములో సమస్యలను అదిగమించి మనోధైర్యముతో ముందుకు సాగాలని తెలియజేసారు.

# 7న జిల్లాకు భారత ప్రభుత్వ జాతీయ భద్రతా సలహా మండలి సభ్యులు డా.జి.సతీష్ రెడ్డి రాక

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 5, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవ సలహాదారుగా (కేబినెట్ హోదా) వ్యవహరిస్తున్న, భారత ప్రభుత్వ జాతీయ భద్రతా సలహా మండలి సభ్యులు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, భారత రక్షణ శాఖలో మాజీ కార్యదర్శి డిఆర్‌డిఓ మాజీ చైర్మన్, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారుగా సేవలందించిన డా.జి.సతీష్ రెడ్డి 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు.

# టీడీపీ కార్యకర్తలే బ్రాండ్

**- కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మంత్రి - అందుబాటులో ఉండే వారే నాకు దగ్గరగా ఉంటారు**

**- అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బ్రాండ్ - మంత్రి నారాయణ**



**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త-వైద్యం** ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు భాగస్వాములు అయి ప్రజలకు తెలియ జేయాలని రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. టీడీపీకి కార్యకర్తలే ఒక బ్రాండ్ అని మంత్రి నారాయణ తెలిపారు. నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరించే వారే నా దగ్గర ఉంటారని మంత్రి తెలిపారు. పనులు చేయడం ఎంత ముఖ్యమో చేసిన పనిని చెప్పుకోవడం కూడా అంతే ముఖ్యం అన్నారు. అభివృద్ధికి బ్రాండ్ టీడీపీ అయితే.. టీడీపీకి బ్రాండ్ కార్యకర్తలే అని, ప్రజలకు మంచి జరిగితే టీడీపీ కార్యకర్తే గుర్తుకు రావాలి అని మంత్రి నారాయణ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్లు, ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు పతక విజేత : యోగా గురువు ప్రసన్న






**కోవూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** విజయవాడలో ఇటీవల జరిగిన జాతీయ యోగా పోటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొన్న కోవూరు చైతన్య యోగా శిక్షణ కేంద్రం శిక్షకురాలు పి.ప్రసన్న బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక చైతన్య యోగా కేంద్రంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యోగా గురువు జనార్ధన్‌మాటల్లాడుతూ జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులను ఓడించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పసిడి పతకం ప్రసన్న సాధించి ఆంధ్రప్రదేశ్ పేరు ప్రతిష్టతలను మరింత ఇనుమడింపజేశారన్నారు. ఆమె పట్టుదల అనితర సాధ్యమన్నారు. అనంతరం బంగారు పతకం విజేత ప్రసన్న మాట్లాడుతూ ఈ కృషి తన ఒక్కరిదే కాదని, యోగా గురువులు జనార్ధన్, రమణయ్యలు తనను ప్రోత్సహించి శీను శిక్షణలో ఇది సాధ్యమైందన్నారు. యోగా సాంకేతిక కార్యదర్శి అనిల్, సింహపురి యోగా కార్యదర్శి పెంచలయ్యలు తనను ప్రోత్సహించి పోటీల్లో పాల్గొనేలా చేశారని, ఇందుకు వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా, పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో జయరామయ్య, రమణయ్య, తదితరులు ఉన్నారు.

# మైపాడు రోడ్డులోని చేపల మార్కెట్‌కు పూర్వవైభవం

- చేపల మార్కెట్‌ను పున: ప్రారంభించిన రాష్ట్ర మంత్రి నారాయణ
- తమ కల సాకారం చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వ్యాపారస్తులు
- మంత్రి నారాయణకు ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు
- రూ.20లక్షలతో చేపల మార్కెట్లో అన్ని సౌకర్యాలు
- త్వరలో స్మార్ట్ స్ట్రీట్‌లో 120 షాపులు ప్రారంభోత్సవానికి సిద్ధం
- 9వ డివిజన్‌లో 19 ఎకరాల్లో దేశంలోనే బెస్ట్ మార్కెట్ ఏర్పాటు
- అప్పులు కడుతూనే అభివృద్ధి చేస్తున్నామన్న రాష్ట్ర మంత్రి నారాయణ






**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని మూడవ డివిజన్ వేణుగోపాల్ నగర్, మైపాడు రోడ్డులో 20 లక్షలతో ఆధునీకరించిన చేపల మార్కెట్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పున:ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి, స్థానిక టీడీపీ నేతలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. తమ కల సాకారం చేసిన మంత్రికి వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. కాసేపు వ్యాపారులతో మంత్రి నారాయణ ముచ్చటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ మార్కెట్‌లలో పరిస్థితి అధ్వాన్నంగా ఉండేదన్నారు. గతంలో ఎవరు పట్టించుకోలేదని, తమ దృష్టికి వ్యాపారులు తీసుకొచ్చారన్నారు. వారి ఇబ్బందులు చూసి చేపల మార్కెట్‌కు రూ.20లక్షలు వెచ్చించి అన్ని సౌకర్యాలతో ఆధునీకరించామన్నారు. దీంతో వ్యాపారుల ఆనందానికి అవధుల్లేవని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. సేవ చేస్తేనే ప్రజలే గుర్తిస్తారని తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్‌లో 120 షాపులు కూడా సిద్ధం అయ్యాయన్నారు. త్వరలోనే సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. 9వ డివిజన్‌లో 19 ఎకరాల్లో దేశంలోకి బెస్ట్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. అప్పులు కడుతూనే అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. సీఎం చంద్రబాబునాయుడు అపార అనుభవంతో రాష్ట్రానికి మళ్ళీ మంచి రోజులు వస్తున్నాయన్నారు. నిన్న ఒక్క రోజే 2,90,000 మంది ఆటో డ్రైవర్లకు రూ.15000 చొప్పున అకౌంట్స్‌లో జమ చేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అనంతరం నెల్లూరు స్మార్ట్ స్ట్రీట్ వద్ద జరుగుతున్న పనులను మంత్రి నారాయణ ఆకస్మికంగా పరిశీలిం చారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కమీషనర్ నందన్, మాజీ మున్సి పల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీ టీసీ విజేతరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, 3వ డివిజన్ మాజీ అధ్యక్షుడు శివాలయం చైర్మన్ కోవి రమణయ్య, అధ్యక్షురాలు కోమరి విజయమ్మ,వైస్‌ప్రెసిడెంట్ కాకర్లగోవర్ధన్, యూనిట్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మీ, కృష్ణ, తులసి, వాసు, బూత్ కన్వీ నర్స్ బుజ్జయ్య, చెన్నయ్య, శోభ, నాగలక్ష్మీ, కవి త, సుధీర్, వెంకటరమణయ్య, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం, ప్రజల మధ్య ఒక వారధి పీ.జి.ఆర్.ఎస్

## పీ.జి.ఆర్.ఎస్‌తో సమర్థవంతమైన ఉపయోగం, అభివృద్ధి




**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 5, ప్రభాతవార్త** మన ముందున్న ఒక శక్తివంతమైన అవకాశం గురించి మాట్లాడాలను కుంటున్నాము. ఇది ఒక సవాలు, అవును, కానీ మంచి పాలన దిశగా ఒక పరివర్తనాత్మక అడుగు. మన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ పిజిఆర్ యొక్క సమర్థవంతమైన ఉపయోగం, అభివృద్ధి గురించి మాట్లాడుకుందాం. పీ.జి.ఆర్.ఎస్ అనేది ఫిర్యాదులను నమోదు చేయడానికి ఒక వేదిక మాత్రమే కాదని మనందరికీ తెలుసు. ఇది ప్రభుత్వం ప్రజల మధ్య ఒక వారధి. ఇది మన పౌరులు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను ప్రతిబింబించే అద్దం వీటిలో చాలా సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారం కానివిగా ఉన్నాయి. రైతులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు లెక్కలేనంత మంది ఇతరులు ఈ వ్యవస్థను ఆశతో చూస్తున్నారు నిజంగా ఆ ఆశను నెరవేర్చాలనుకుంటే, శిబిళీను వ్యూహాత్మకంగా, పౌరులకేంద్రీకృత మార్గంలో సంస్కరించడం వేగవంతం చేయడం అనే సవాలును స్వీకరించాలి. నిజమైన మార్పును తీసుకురాగల నాలుగు కీలకమైన చర్యలను మీ ముందుకు.

**మొదటగా..** ప్రతి వారం పదే పదే లేవనెత్తే సమస్యలను గుర్తించాలి. ఈ పునరావృతమయ్యే సమస్యలు వ్యవస్థాగత లోపాలకు సూచికలను మూలం వద్ద వాటిని గుర్తించి పరిష్కరించగలిగితే, భవిష్యత్తులో వందలాది ఫిర్యాదులను నివారించవచ్చు.

**రెండవది..** పదే పదే లేదా పనికిమాలిన పిటిషన్లతో వ్యవస్థను దుర్వినియోగం చేసే పిటిషన్ మోంగర్లను గుర్తించాలి. అటువంటి కేసులను ఫిల్టర్ చేయడం ద్వారా, మన దృష్టిని వనరులను నిజమైన సమస్యలపై కేంద్రీకరించవచ్చు.

**మూడవది..** అధికార స్థాయిల ద్వారా పరిష్కార యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించడానికి ఇది సమయం కలెక్టర్ స్థాయిలో, అధిక ప్రాధాన్యత, బహుళశాఖల సమస్యలను చేపట్టవచ్చు. జాయింట్ కలెక్టర్ స్థాయిలో, సివిల్ సప్లైస్ వంటి కీలక రంగాలను పరిష్కరించ వచు డిఆర్ఓ స్థాయిలో, ఆర్‌టిఐ రెండవ అప్పీళ్లు పారదర్శకత విషయాలపై దృష్టి పెట్టండి. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ స్థాయిలో, ఉద్యోగుల సమస్యల మాడ్యూల్‌ను అమలు చేయాలి సిబ్బంది ఆందోళనలను గుర్తించడానికి, రికార్డ్ చేయడానికి, పరిష్కరించడానికి. ఎందుకంటే ఉద్యోగులు విన్నట్లు మద్దతు పొంది నట్లు భావించినప్పుడు, పరిపాలన మరింత సమర్థవంతంగా, సహకారంగా మారుతుంది.

**నాలగోవది..** ప్రజల విశ్వాసాన్ని పెంపొందించాలి. అలా చేయడానికి ఉత్తమ మార్గం పారదర్శకత. పరిష్కరించబడిన ప్రతి ఫిర్యాదు తర్వాత పౌరుడి నుండి టెస్టిమోనియల్ తీసుకోవాలి, దీనిని ప్రింట్ మీడియాలో, అధికారిక వెబ్‌సైట్‌లలో ప్రచురించాలి. వారి ప్రభుత్వం వారి మాట వినడమే కాకుండా చర్యలు కూడా తీసుకుంటుందని ప్రజలకు తెలియజేయాలి ఇది ఒక సాధారణ పని కాదు. ఇది ఒక సవాలుతో కూడుకున్న మిషన్ కానీ ఇది మన జిల్లాను ఫిర్యాదుల పరిష్కారంలో మాత్రమే కాకుండా పౌరుల విశ్వాసం, పాలనా నైపుణ్యంలో కూడా అగ్రస్థానంలో నిలిపే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీన్ని ఒక ఉమ్మడి బాధ్యతగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవ చేయడానికి సమర్థవంతమైన, ప్రతిస్పందించే, నిజంగా పౌరులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చే పరిపాలనను సృష్టించడానికి ఒక నిబద్ధత. దీన్ని సాధ్యం చేయగలరు.

### పీ.జి.ఆర్.ఎస్ బృందం యొక్క సామర్థంపై ఆందోళన

పిటిషన్ పరిష్కారంలో పీ.జి.ఆర్.ఎస్ బృందం యొక్క సామర్థంపై ఆందోళన సరియైన ల్యాండ్‌లైన్‌లు, ప్రత్యేక ఇంటర్నెట్ కనెక్షన్‌లు, ఎయిర్ కండిషన్డ్ కార్యాలయ స్థలం, ఇతర అవసరమైన సౌకర్యాలతో దాదాపు 15 మంది సిబ్బందితో కూడిన చక్కటి పీ.జి.ఆర్.ఎస్ బృందం ఉన్నప్పటికీ, పిటిషన్ పరిష్కారం యొక్క సామర్థం ప్రశ్నార్థకంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

### అంచనా వేయవలసినవి

పిటిషన్‌లను ఎంతవరకు చురుకుగా పరిశీలిస్తున్నారు..? సమస్యల యొక్క తదుపరి చర్య ముగింపు కోసం ఒక యంత్రాంగం ఉందా..? ఈ విభాగానికి కేటాయించిన వనరులను దృష్టిలో ఉంచుకుని, జవాబుదారీతనం, పారదర్శకత కొలవదగిన ఫలితాలు ఉండేలా వారి పనితీరును సమీక్షించడం చాలా అవసరం.

### ప్రజా సేవకు అంకితమైన కార్యాచరణఆధారిత బృందం

పీ.జి.ఆర్.ఎస్ బృందం యొక్క ప్రధాన బాధ్యత కేవలం జిల్లా స్థాయి ప్రగతి శాతాలను సాధించటానికి మాత్రమే పరిమితం కాకూడదు. గణాంకపరమైన లక్ష్యాలు ప్రగతి గణాంకాలు ముఖ్యమైనవే అయినప్పటికీ, ఈ వ్యవస్థ యొక్క నిజమైన లక్ష్యాన్ని అవి కప్పివేయకూడదు: ఓపిక, సానుభూతితో పౌరుల మాట వినడం, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం. ప్రస్తుత దృష్టి సంఖ్యాపరమైన లక్ష్యాలను చేరుకోవడంపై ఎక్కువగా ఉన్నట్లు గమనించబడింది శాతాల ద్వారా పురోగతిని ప్రదర్శించడం. ఈ సంఖ్యలు తరచుగా క్షేత్రస్థాయి లో నిజమైన ప్రభావాన్ని ప్రతిబింబించవు. చాలా సందర్భాలలో, సంవత్సరాల తరబడి పరిష్కారం కాని సమస్యలు నిజాయితీతో కూడిన ప్రయత్నంతో పరిష్కరించబడవచ్చు, అయినప్పటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి. పీ.జి.ఆర్.ఎస్ యొక్క నిజమైన విజయం మూసివేయబడిన వినతుల శాతం కాదు, శ్రద్ధ, జవాబుదారీ తనంతో పరిష్కరించబడిన సమస్య కలిగిన పౌరుడి యొక్క నిజమైన సంతృప్తి. ఈ లక్ష్యం కేవలం పరిపాలనాపరమైన లక్ష్యలకు మాత్రమే కాకుండా నిజమైన ప్రజా సేవకు అంకితమైన, అంకితభావం, సానుభూతి, కార్యాచరణఆధారిత బృందం ద్వారా మాత్రమే నెరవేర్చబడుతుంది. ఈ దృష్టిని పునరుద్ధరించి, వ్యవస్థ అంతటా తీవ్రత, సమగ్రతతో అమలు చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

# కాస్త ఓపిక పడితే అన్ని పనులు పూర్తి చేస్తాం

**నెల్లూరు 48వ డివిజన్లో రూ.40 లక్షలతో ఆధునికరించిన ఏపీజే అబ్దుల్ కలాం పార్క్**

**పార్కును లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ**

**మంత్రికి ఘన స్వాగతం పలికిన స్థానికులు, చిన్నారులు, టిడిపి శ్రేణులు**

**నెల్లూరు సిటీలో రోజుకు మూడు లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యం**

**మల్లప్ప రామిరెడ్డి ఉయ్యాల కాలవల రీమెంట్ పనులు చేపడుతాం**

**దోమలు లేని నెల్లూరు నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం**

**రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ**



**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు 48 వ డివిజన్ లో రూ.40 లక్షలతో ఆధునీకరించిన ఏపీజే అబ్దుల్ కలాం పార్కును రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా డివిజన్ విచ్చేసిన మంత్రికి మేళతాళాలతో స్థానికులు, టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మంత్రికి స్వాగతం పలుకుతూ చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం అందరి సమక్షంలో మంత్రి లాంఛనంగా పార్కును ప్రారంభించారు. దీంతో పార్కులో జాతర వాతావరణం నెలకొంది. కాసేపు మంత్రి నారాయణ పిల్లలతో ఆటలాడించి, చాక్లెట్లు పంచి సరదాగా గడిపారు. అన్ని హంగులతో ఆహ్లాదభరితంగా పార్కును తీర్చిదిద్దిన మంత్రికి చిన్నారులతో పాటు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. తదనంతరం 48 వ డివిజన్ విరాట్ నగర్, 49 డివిజన్ సుబ్బారెడ్డి స్ట్రీట్ లో ఏర్పాటు చేసిన మూడు ఎన్టీఆర్ సుజల సురక్ష తాగునీటి ప్లాంట్లను మంత్రి నారాయణ ప్రారంభించారు. ఆయా ప్రాంతవాసులు నారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో పార్కులు, మంచినీటి పథకాలు నిర్వీర్యం అయ్యాయని మండిపడ్డారు. అయితే స్థానికుల కోరిక మేరకు అబ్దుల్ కలాం పార్కును ఆధునీకరించి ప్రారంభించామన్నారు. పార్కు ప్రారంభం సందర్భంగా పిల్లల సంతోషం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో ఆరులక్షల లీటర్ల మినరల్ వాటర్ సరఫరా చేసేందుకు ఎన్టీఆర్ సుజల సురక్ష పథకాన్ని 2014 లో ప్రారంభించామన్నారు. రెండున్నర కోటితో పనులు కూడా చేసామని తెలిపారు. అయితే మా పై కోపంతో ఆ పథకాన్ని గత పాలకులు అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి పార్కులు, వాటర్ ప్లాంట్ల పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 20 వాటర్ ప్లాంట్లను ఇప్పటికే పూర్తి చేసామని, మరో రెండు నెలల్లో మరో 40 ప్లాంట్లు పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెండు రూపాయలకే 20 లీటర్ల మంచినీటిని అందిస్తామన్నారు. నెల్లూరు సిటీలో రోజుకి 3 లక్షల లీటర్ల మినరల్ వాటర్ సరఫరా చేయటమే లక్ష్యం అని తెలిపారు. ఓపిక పడితే అన్ని పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. మల్లప్ప, రామిరెడ్డి, ఉయ్యాల కాలువల రివిట్ మెంట్ పనులు చేపడతామన్నారు. అభివృద్ధిపనులకు కాలువల ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. నెల్లూరును దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజల సహకారంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో నెల్లూరును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్.. డిప్యూటీ మేయర్ తాహాసీన్ ఇంతియాజ్ ,రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు,రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిరా శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తల్లాపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి,సిటీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కపిరా రేవతి..48వ డివిజన్ అధ్యక్షులు వేలూరు పెంచల బాబు ,కో క్లస్టర్ ఇంచార్జ్ షేక్ జాఫర్ ,డివిజన్ ఇంచార్జ్ శ్రీమతి వేలూరు కీర్తి ,కాంట్రాక్టర్ కయ్యాల గోపి ,బూత్ కన్వీనర్ పోలిచర్ల సీనయ్య కృష్ణమనేని, నవీన్‌పొన్నారం, సురేష్, 49వ డివిజన్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఖాదర్ బాషా, టీడీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు..



# నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

**- సమాచారం కోసం 1100 కాల్ సెంటర్ - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 5, ప్రభాత వార్త** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీ కోసం ఏపి.జిఓవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఆవుల చిన్న పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 5, ప్రభారవార్త:** కావలి రూరల్ మండలం పెద్దనట్టు గ్రామంలో నివసిస్తున్న ఆవుల చిన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్నకావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి ఆవుల చిన్న భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కావలి రూరల్ మండలం అధ్యక్షులు అవుల రామకృష్ణ, ఏఎంసి వైస్ చైర్మన్ శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకుడు, శీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తము ఉపాధ్యాయురాలుగా జమున




**కావలి, అక్టోబర్ 5, ప్రభారవార్త:** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కావలి పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలి శెట్టి జమునకు కరీంనగర్ నందు జి.ఎస్. పి ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు గంగారపు మల్లేశం, కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన శ్రీ రాజరాజేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట్ల రామకృష్ణ ఇతర ప్రముఖుల సమక్షంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పురస్కారాన్ని అందజేసి ఆమెను దృశ్యాలవాలతో ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాన్ని, గోల్డ్ మెడల్ ను అందజేయడం జరిగింది. ప్రతిభను గుర్తించి ఎంపిక చేసిన గంగారపు మల్లేశం కు మొగిలి శెట్టి జమున కృతజ్ఞతలు తెలియజేశారు.

## దుర్గాదేవి రూపంలో అంకమ్మ తల్లికి

**విడవలూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వెలసియున్న అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుండి అభిషేకాలు, కుంకుమ అర్చన, భక్తులచే అత్యంత వైభవంగా అర్చకులు కొర్నాగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో వైభవంగా పల్లకి సేవ చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. అంతకు ముందు భజన భక్తమండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవకరించారు.



## జాబ్ కార్డు దారులకు ఈకేవైసీ



**వింజమూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత చేకూర్చేందుకు ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ విధానంలో ఉపాధి శ్రామికుల హాజరును నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా మొదటగా మండలంలోని జాబ్ కార్డు కలిగిన అందరూ సభ్యులు ఈకేవైసీ తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని జాబ్ కార్డు కలిగిన సభ్యులందరు ఈకేవైసీ పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో పని ప్రదేశంలో ఉపాధి శ్రామికుల హాజరును ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ విధానంలో తీసుకోవడం జరుగుతుంది. దీని ద్వారా ఒక జాబ్ కార్డుపై ఇతరులు పని చేయడం, గ్రామాలలో లేని వారికి హాజరు వేయడం వంటి అవకతవకలు లేకుండా నివారించడానికి వీలు కలుగుతుందని తద్వారా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత చేకూరనుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వింజమూరు మండలంలో 8290 ఆక్టివ్ జాబ్ కార్డుల నందు 12402 మంది యాక్టివ్ వర్కర్లు ఉన్నారు. వీరందరి నుండి ఉపాధి హామీ సిబ్బంది ప్రస్తుతం ఈకేవైసీ సేకరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఏపీవో, ఎంపీడీవో పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

## నేడు ఎమ్మెల్యేచే రాపూరులో గ్రీవెన్స్

**రాపూరు, అక్టోబరు 5ప్రభాతవార్త :** వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సోమవారం రాపూరు మండల ప్రజపరిషత్ కార్యలయంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం(గ్రీవెన్స్ డే) నిర్వహిస్తారని రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డిలు తెలిపారు. మండలంలోని తెలుగుదేశం, జనసేన, బిజేపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామాలలో వున్న సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం యంపీడీఓ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ యువనాయకుడు చెన్ను అశోక్ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



## కండలేరులో 58.460 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం(రావూరు), అక్టోబరు05 ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయం నాటికి జళాశయంలో 58.460 టీయంసీల నీటిమట్టం నమెదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.అనీల్ కుమార్తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 3600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 580 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 30 క్యూసెకు,లో లేవల్ స్లూయిస్ ద్వారా 40 క్యూసెక్కుల చోప్పున మొత్తం 650 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.



## కల్తీ మద్యంతో హోల్ సేల్ వ్యాపారం చేసిన పెద్దమనిషి జగన్‌రెడ్డి

- ప్రమాదకర మద్యంతో అమాయకుల ప్రాణాలు తీసిన వారిని పదవులిచ్చి ప్రోత్సహించిన చరిత్ర ఆయనది
- అక్రమాలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో సహించదు
- సమర్ధంగా పని చేసి మద్యం డంప్‌ను పట్టుకున్న వారిని అభినందించాల్సిందిపోయి.. విమర్శలా..
- టీడీపీ సీనియర్ నాయకులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** కల్తీ మద్యంతో హోల్ సేల్ వ్యాపారం చేసిన పెద్దమనిషి జగన్‌రెడ్డి అని, ప్రమాదకర మద్యంతో అమాయకుల ప్రాణాలు తీసిన వారిని పదవులిచ్చి ప్రోత్సహించిన చరిత్ర ఆయనదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులో మీడియాతో టీడీపీ సీనియర్ నాయకులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం గురించి జగన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం కేంద్రంపై ఎక్సైజ్‌శాఖ అధికారులు రైడ్ చేసి పట్టుకున్నారు. కల్తీ మద్యం రాష్ట్రమంతా జరుగుతోందని, సీఎం చంద్రబాబు నాయుడే ప్రోత్సహిస్తున్నారని జగన్‌రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. అక్రమాలను మా కూటమి ప్రభుత్వం సహించే పరిస్థితే లేదన్నారు. రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో జరుగుతున్న కల్తీ మద్యం కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. ప్రభుత్వం, అధికారులు సమర్ధవంతంగా పని చేసినందుకు అభినందించాల్సింది పోయి నిందలు వేస్తారా అని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌రెడ్డి సారథ్యంలోనే హోల్ సేల్‌గా కల్తీ మద్యం వ్యాపారం జరిగింది. బలవంతంగా గుంజుకున్న డిస్టలరీల్లో కల్తీ మద్యం తయారు చేసి ప్రభుత్వ డిపోలు, మద్యం దుకాణాల ద్వారా జనం నెత్తిన పోశారు. ఆ కల్తీ మద్యం తాగి వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది అనారోగ్యం పాలయ్యారు. డిస్టలరీలను జగన్‌రెడ్డి లెఫ్ట్, రైట్లు బలవంతంగా సొంతం చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.3500 కుంభకోణం దేశంలోనే ఒక సంచలనం. ఓట్లు వేసి అధికారం ఇచ్చిన ప్రజలకు కల్తీ మద్యం పోసి చంపిన పార్టీగా వైసీపీ చరిత్రలో నిలిచిపోతుంది. ఇన్ని పాపాలు చేసిన జగన్‌రెడ్డి ఈ రోజు జగన్‌రెడ్డి నీతులు వల్లించడం విచిత్రంగా ఉంది. చర్యలు చేపడితే విమర్శిస్తారు.. చర్యలు చేపట్టకపోయినా విమర్శలు చేస్తారు. ఇది జగన్ రెడ్డి నైజం. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో చర్యలు తీసుకోకుండా ఉండదు అన్నారు. తీవ్రమైన ఫ్రస్టేషన్‌లోనే జగన్‌రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు అన్నారు. కల్తీ మద్యం కుట్రదారులను ప్రోత్సహించిన చరిత్ర జగన్ రెడ్డిది అని అన్నారు. 2014లో గవర్నర్ పాలన సాగుతున్న సమయంలో సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు కల్తీ మద్యంతో అమాయకులను చంపేశారు అన్నారు. కరుడుగట్టిన మాఫియాతో కలిసి ప్రమాదకరమైన కల్తీ మద్యాన్ని రెండు నియోజకవర్గాల్లో భారీ ఎత్తున డంప్ చేశారు, గోవాతో పాటు పాండిచేరి, కర్ణాటక నుంచి ప్రమాదకరమైన కల్తీ మద్యాన్ని తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. అప్పట్లో అధికారుల 14 డంప్‌లను గుర్తించి కేసులు నమోదు చేశారని, కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 4, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి పై 6 కేసులు నమోదు అయ్యాయన్నారు. సర్వేపల్లిలో ఐదుగురు, కావలిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్నారు. కల్తీ మద్యం పోసి అమాయకుల ప్రాణాలు తీసిన వారిపై చర్యలు తీసుకోకపోగా పదవులు ఇచ్చి ప్రోత్సహించిన చరిత్ర జగన్‌రెడ్డిది అని అన్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే కాదు ,రాష్ట్ర వ్యాప్తంగా అవినీతిని, మద్యం మాఫియాను ప్రోత్సహించి కల్తీ మద్యంతో హోల్ సేల్ వ్యాపారం చేసిన జగన్‌రెడ్డికి మాట్లాడే హక్కులేదు అన్నారు.

## గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది న్యాయమైన కోరికలు పరిష్కరించాలి



**కావలి, అక్టోబర్ 5, ప్రభారవార్త:** గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది న్యాయమైన కోరికలను పరిష్కరించాలని సామాజిక కార్యకర్త సి.శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు 2019-24 మధ్య ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన గ్రామ వార్డు సచివాలయాల ఏర్పాటు చేసి , ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను సులువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొత్త విధానాన్ని రూపొందించడం జరిగిందని తెలియజేశారు. గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే చేర్చి వారిని తెలియజేశారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది కరోనా కష్టకాలంలో చేసిన సేవలు అపూర్వమనీ తెలియజేశారు. ఇంటింటికి రేషన్ పంపించేవారన్నారు. వాలంటీర్లను తొలగించాక సచివాలయం సిబ్బంది వాలంటీర్ల పనిని కూడా తమ విధులతోపాటు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఇది వాళ్లకు పనిభారాన్ని పెంచడమే కాకుండాదీనికి తోడుగా సర్వేలు కూడా చేయాలనడం వల్ల సచివాలయ ఉద్యోగులు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారన్నారు. వారికి ఇంక్రిమెంట్లు ,ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయం అని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసనకు దిగడం జరిగిందన్నారు. వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం యంత్రాంగాన్ని పంపడం దారుణమన్నారు. గాంధేయ మార్గంలో శాంతియుత నిరసనలు తెలియజేసే ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరగరాదని వెంటనే ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి న్యాయం చెయ్యాలనిని కోరారు.

## తూమాయిలో పేకాట స్థావరాలపై దాడులు

**తూమాయి (రాపూరు) , అక్టోబరు 5 ప్రభాతవార్త :** మండలంలోని తూమాయి గ్రామ సమీపంలో జరుగుతున్న పేకాట స్థావరాలపై ఆదివారం రాపూరు ఎస్ఐ వెంకట రాజేష్ తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న 7 మంది వ్యక్తులను పట్టుకోని వారి నుండి రూ.9,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దాడులలో రాపూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది వున్నారు.



## రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తుతెలియని మృతదేహం



**లింగసముద్రం అక్టోబర్ 5 ప్రభాతవార్త:** రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తు తెలియని మృతదేహం నీటిలో తేలాడుతుంది. ఆదివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త గేట్లు పాత గేట్లు మధ్యలో ఉన్న స్థలంలో ఫోటో లు తీసుకునేందుకు కొంతమంది యువకులు అక్కడికి వచ్చారు. ఆ సమయంలో ప్రాజెక్టులోని నీటిని పరిశీలించగా అక్కడ ఉన్న మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న లింగసముద్రం ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు వద్దకు వచ్చి నీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పై డ్రాయర్ తప్ప ఒంటిమీద ఎలాంటి దుస్తులు లేవు. నీటిలో తేలాడుతున్న మృతదేహం మొహం నీటిలో ఉండటంవల్ల వీపు భాగం మాత్రమే కనిపిస్తుంది. 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని తెలుస్తుంది. బయటికి తీసేందుకు చీకట పడడంతో సోమవారం తీస్తామని ఎస్సై తెలిపారు. అయితే రెండు మూడు రోజుల క్రితమే మృతుడు ప్రాజెక్టులో పడి చనిపోవడం జరిగిందని మృతదేహాన్ని చూస్తే తెలుస్తుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుండి మృతదేహం వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ఉదయగిరి అయ్యప్ప భక్తులకు విజ్ఞప్తి



**ఉదయగిరి, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని శబరిమలలో నవంబర్ 16నుండి డిసెంబర్ 31 వరకు మండల పూజలు జరుగుతాయని ఉదయగిరి అయ్యప్ప సేవా సమాజం గురు స్వాములు వెల్లడించారు. మండల పూజలు యాత్రలో పాల్గొనదలచిన అయ్యప్ప భక్తులు తప్పనిసరిగా 41 రోజుల దీక్ష చేయాలని సూచించారు. భక్తులు అక్టోబర్ 10 నుంచి 15వ తేదీ మధ్యలో మాలధారణ చేయాలన్నారు. 41 రోజు దీక్ష పూర్తయిన తర్వాత ఇరుముడి కట్టి శబరిమలైకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీవీ ప్రసాద్ నారాయణరెడ్డి, బాలాజీ, శ్రీనివాసులు, ఉప్పుటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకుని వ్యక్తి మృతి

**కావలి, అక్టోబర్ 5, ప్రభారవార్త:** ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కావలి పట్టణంలో జరిగింది. కావలి వన్ టౌన్ పోలీసుల సమాచారం మేరకు కావలి రూరల్ మండలం, అన్నగారి పాలెం పంచాయతీ, పెద్ద నట్టు గ్రామానికి చెందిన ఆవుల లక్ష్మయ్య (29) తుమ్మలపెంట గ్రామ సెంటర్ నందు బేకరీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నరని తెలియజేశారు. చీరాల ఓడరేవు వద్ద నివసిస్తున్న ఆదిలక్ష్మిని శనివారం రాత్రి తన స్కూటీపై ఎక్కించుకొని కావలి పట్టణంలోని రైతు బజార్ వర్ధకు రాగా స్కూటీని వేడుక ఆటో బలంగా ఢీకొనడంతో ఆవుల లక్ష్మయ్య డివైడర్ ని ఢీకొనడంతో బలమైన గాయాలయి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని తెలియజేశారు. ఆదిలక్ష్మికి బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించడం జరిగిందని తెలియజేశారు. కావలి ఒకటో పట్టణ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# క్షేత్రస్థాయిలో సమావేశాలు,రికార్డులు నిల్ గోల్‌మాల్ అవుతున్న నిధులు

## పట్టించుకోని అధికారులు

**వలేటివారిపాలెం అక్టోబరు 5 ప్రభాతవార్త :** వలేటివారిపాలెం మండలంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్థానిక అధికారుల నిర్లక్ష్యం అవినీతి, ఉన్న తాధికారులు అశ్రద్ధ కారణంగా మండలంలో పొదుపు సంఘాల పనితీరు అధ్వానంగా ఉంది. క్షేత్రస్థాయిలో సమావేశాలు లేవు. సభలు లేవు. దీంతో పొదుపు సంఘాల నిధులు గోల్‌మాల్ అవు తున్నాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకో వాల్సిందిగా పలువురు కోరుతున్నారు. మహిళా సాధికారత సాధించాలన్న ఆశయంతో 1994-95 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయోగాత్మకంగా డ్వాక్రా సంఘాలను ప్రారంభించారు. వీటి ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయ ఉపాది సామర్ధ్యం పెంపొందించడమే లక్ష్యంగా 2002నాటికి రాష్ట్ర వ్యాప్తంగా వీటికార్యకలాపాలను విస్తరించారు. దీని అమలుకు పేదరికె నిర్మూలన సంస్థను ఏర్పాటుచేశారు.

### పొదుపు గ్రూపుల ఏర్పాటు:

క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామంలో 10మంది మహిళలతో ఒక స్వయం సహాయక సంఘం పొదుపు గ్రూపు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏర్పాటైన అన్ని గ్రూపులను కలిపి గ్రామ మహిళా సమాఖ్య, మండలంలోని అన్ని గ్రామమహిళా సమాఖ్యలను కలిపి మండల మహిళా సమాఖ్యలను నియమించారు. గ్రూపుకు ఇద్దరు లీడర్లు, వీవోకి గ్రామకమిటీ, మండలానికి మండల కమిటీల ద్వారా నిర్వహిస్తుంటారు. వీటి కార్యకలాపాలను సక్రమంగా సమన్వయం చేయుటకు గ్రామస్థాయిలో వీవోఏలు, మండల స్థాయిలో (సమన్వయకర్తలను) సీసీలను, ఏపీఎంలను నియమించారు. జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ పీడీ ద్వారా మానిటరింగు చేస్తున్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలి. ఆర్థికలావాదేవాల నిర్ణయాలతోపాటు పలు తీర్మా నాలను రికార్డులో నమోదు చేయాలి. వివిద సంస్థల ద్వారా తీసుకున్న రుణాలు చెల్లింపులు క్రమం తప్ప కుండా నమోదు చేయాలి. రశీదులు అంద చేయాలి. పొదుపు సంఘం నిర్వహణాతీరు మేరకు బ్యాం కులు, ప్రభుత్వసంస్థలు రుణాలు చెల్లిస్తుంటాయి. వీటిని తిరిగి సకాలంలో చెల్లించాలి.

### నిధులు విడుదల:

మండలానికి సీఐఎఫ్ కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంటు పండ్ కింద రూ.50లక్షలు, స్త్రీనిధి కింద రూ.3.5కోట్లు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.60లక్షలు నిధులు విడుదలయ్యాయి. బ్యాంక్‌ల ద్వారా అర్హత గల గ్రూపులకు రూ.1లక్ష నుంచి 20లక్షల వరకు ఏటా రూ.25కోట్లకి పైగా రుణ సౌకర్యం కల్పిస్తున్నారు.

### సభలు సమావేశాలు నిల్ :

క్షేత్రస్థాయిలో పొదుపు సంఘాల పనితీరు అధ్వానంగా ఉంది. సభలు లేవు. సమావేశాలు లేవు .సంఘాలను సమన్వం చేయాల్సిన సిబ్బంది అడ్రసులేదు. మండలంలో 31వీవోలు ఉన్నాయి. పోకూరు, శింగమనేనిపల్లె, వలేటివారిపాలెం ,చుండి అను 4 క్లస్టర్‌లుగా విభజించారు. ప్రతి వీవోకి వీవోఏ ఉంది. 4గురు సీసీలు ఉన్నారు. వీరు సమయపాలన పాటించడంలేదు. వీరి హాజరులో థంబ్, ఎఫ్ఆర్ఎస్ లేకపోవడంతో సమయపాలన పాటించడం లేదు. వీరంతా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. లింకేజీ పేరుతో మామూళ్లు వసూలు చేస్తున్నారు. సభ్యులకు అవగాహన లేదు. సాధికారిత లేదు. సామాజిక అంశాలపై ఊసేలేదు. రుణ మంజూరు సమయంలో తీర్మానాలు రాస్తుంటారు. దొంగవేలిముద్రలు వేస్తుం టారు. లీడర్లను నమ్మకంతో సభ్యుల నుంచి రికవరీ వసూలు చేసి స్వాహ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఏపీఎం సైతం మామూళ్లు ముడుతున్నట్లు ఆరోప ణలు ఉన్నాయి. దీంతో ఆయన కూడా పట్టిం చుకోవడం లేదు. ఇక డీపీఎం ఐబీ జాడే ఉండదు. ఏనాడు మండలానికి సందర్శించిన దాఖలాలులేవు. సమావేశాలు రికార్డులు లేకపోవ డంతో ఈ విషయం నెలలు ఏళ్ల తరువాత



తెలుసుకొన్న సభ్యులు గగ్గోలు పెడుతున్నారు .బ్యాంకులోను రికవరీని స్వాహాచేస్తున్నారు.

### నిధులు గోల్ మాల్:

బ్యాంకు నుంచి తీసుకున్న రుణం సకాలంలో సభ్యులు చెల్లిస్తున్నప్పటికిని బ్యాంకులో జమకావడంలేదు. ఈ విషయం చాలా గ్రామాల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉనా న్నయి. అయితే పూర్తి స్థాయిలో సభ్యులకు తెలియడం లేదు. కారణం సభలు సమావేశాలు లేకపోవడమే. ఇందు లో బాగంగానే ఇటీవల బడేవారిపాలెంలోని అంబే ద్కర్ గ్రూపు మూడేళ్ల కిందట రూ.10లక్షలు రుణం తీసుకొన్నారు. సభ్యులు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నప్పటికిని బ్యాంకులో జమకాలేదు. లీడర్లు, వీవోఏలు స్వాహాచేసినట్లుగా ఒకరిపై ఒకరు ఆరోపిం చుకుం టున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వ రరావు దగ్గర పంచాయతీ జరిగింది. అదేవిధంగా చాలా గ్రామాల్లో ఇదే తంతు. 20లక్షలు లోను తీసుకుంటే నెలకు రూ.50నుంచి 60వేలు దాకా ప్రతి నెలా చెల్లిస్తునా న్నరు. ఇంతమొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నప్పటికిని రశీదులు రికార్డులు నిర్వహించడంలేదు. రుణం మంజూరు సమయంలో సీసీలు, వీవోఏలు మామూళ్లు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వనిదే పనులు చేయడం లేదని పలువురు వాపోతున్నారు. దీంతో సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

### బ్యాక్‌లిస్టులో మండలం:

బ్యాంకురుణాలు మినహా మిగిలిన రుణాలు రికవరీ పడిపోయింది. స్త్రీనిధిరుణం మూడేళ్లుగా చెల్లించడం లేదు. దీంతో ఆ సంస్థ మండలానికి నిధులు మంజూరు నిలిపేసింది. మండలాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టింది. సబ్‌ప్లాన్ నిధులు రికవరీలో జిల్లాలో అట్టడుగుస్థాయికి చేరింది. గతంలో పనిచేసిన కొందరు ఏపీఎంలు అంకభూపాలపురం ,అయ్యావారిపల్లె శింగమనేనిపల్లె, అత్తంటివారిపాలెం తదితర గ్రామాల్లో నిధులుస్వాహా చేశారు. ఈమేరకు కమ్యూనిటి సంబందిత అధికారులుకు తెలియ చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయమై ఇన్‌చారీ ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను ఇటీవ లనే పదవీ బాద్యతలు చేపట్టినట్లు తెలిపారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

## నేడు పొదలకూరు రోడ్డు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పొదలకూరు రోడ్డు 11 కోట్ల రూపాయలతో నిర్మించిన పొదలకూరు రోడ్డు ఆధునీకరణ, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్, వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ కార్పొరేషన్ మరియు ఆర్ అండ్ బి అధికారులతో కలసి టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. పొదలకూరు రోడ్డు ఆధునీకరణ, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ మరియు వివిధ అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి, ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించనున్నారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువ నేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి, మున్సిపల్ శాఖ రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణకి, రోడ్లు, భావనల శాఖ రాష్ట్ర మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డిలకు నెల్లూరు రూరల్ ప్రజలపక్షాన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొడపనేని రాజా నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ షంషుద్దీన్, మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్ , సాబీర్ ఖాన్, నెల్లూరు రూరల్ టిడిపి యువత అధ్యక్షుడు నందిపాటి శ్యామ్, 36వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు అబ్దుల్ రసూల్, 35వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు బార్నబాస్, టిడిపి నాయకులు గూటూరు శ్రీధర్ నాయుడు, చల్ల భాస్కర్, నందిపాటి ఇజ్రాయిల్, బిరదల సుభాష్, మారుతి, సి.హెచ్ రవి, మునిశేఖర్ నాయుడు, గోపి, గురవయ్య, హనీఫ్, అబ్దుల్ జబీర్, జహీర్, ముజామిల్, లోక్నాథ్ సింగ్, శివ సింగ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి




**నెల్లూరు రూరల్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకుపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతీయ సమాజం నుండి కుల వివక్షను తొలగించడానికి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పడానికి ఆయన కృషి చేశారు. మనమందరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టిగల నాయకుడు మరియు సంఘ సంస్కర్త. భారతీయ సమాజంలో ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివి అని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ కోసూరు సుభాషిణి, గ్రామ ఉప సర్పంచ్ సాల్మన్, ఏ.ఎం.సి. డైరెక్టర్ కాకుపల్లి శివకుమార్, టిడిపి నాయకులు కోసూరు కేశవులు, ఉప్పల ఈశ్వరయ్య, మహేందర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కనిమేల రమణయ్య, వేణు, మోహన్ రావు, కోటేశ్వరరావు, శ్రీను, సూర్యం, రణదీప్, శ్రీనివాసరెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాయణ, రాము, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పండ్ల పంపిణీ



**పొదలకూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** పొదలకూరు మండలంలోని హరిత వృద్ధుల ఆశ్రమం నిర్వాహకురాలు రాజేశ్వరమ్మ సమక్షంలో 23 మంది వృద్ధులకు ఆదివారం పండ్లు పంపిణీ చేసారు. బిరదవోలు చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయుచున్న సుధాకర్ రావు వారి తల్లి జ్ఞాపకార్థం నెల్లూరులోని హరిత వృద్ధుల ఆశ్రమం లోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా అంబటి



**వింజమూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** వింజమూరు మండల బీజేపీ నూతన అధ్యక్షులుగా అంబటి ఈశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం నాడు నెల్లూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిఫారెడ్డి వంశీధర్‌రెడ్డి అధికారికంగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో వింజమూరు మండలం బీజేపీకి మొదటి నుండి గట్టిగా పట్టున్న మండలం కావున ఈ మండలాన్ని నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డికి ఇవ్వడం ఎంతో సంతోషమని అన్నారు. ఈశ్వర్‌రెడ్డి గతంలో ఏబీవీపీ బీజేవైఎం బీజేపీలో పని చేసిన అనుభవంతో మండలంలో బీజేపీని బలోపేతం చేస్తాడని ఆశిస్తున్నాను. మండల అధ్యక్షుడు అంబటి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నన్ను ఈ పదవికి నియమించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. దేశంలో ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అనేక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించి తద్వారా పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఎన్డీఏ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానన్నారు. వింజమూరు మండలంలో బీజేపీ పార్టీని ఒక బలమైన శక్తిగా తయారు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మరియు అధికారుల దృష్టి తీసుకొని వెళ్లి ఆ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మద్దూరి నాగేశ్వర్‌రెడ్డి, గని రమణయ్య, నాయకులు దాసరి ప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, లెక్కమలేని రాజేష్ నాయుడు, మల్లం కొండారెడ్డి, మన్నేటి శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, ఎల్.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసిన వైసీపీ నాయకుడు వెంకటరావు



**కందుకూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** పట్టణంలోని జనార్ధనస్వామి దేవస్థానం సమీపంలో సత్యసాయిబాబా దేవస్థానంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆర్టిఐ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు, తాటికొండ వెంకట్రావ్ ఆర్థిక సహాయంతో పలువురు పేదలకు ఆదివారం చీరలు. దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు పేద ప్రజలను అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మానవుల పట్ల ప్రేమ, శాంతి, సహాయం వంటి సూత్రాలను బోధించిన సత్యసాయిబాబా స్ఫూర్తి ఆదర్శనీయం అన్నారు. ఆ మహాత్ముడు బోధించిన విధంగా పేదలను అదుకునేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని, భవిష్యత్లో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయిబాబా దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురు రక్తదానం




**కావలి, అక్టోబర్ 5,ప్రభారవార్త:** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం మరియు దివంగత ప్రజా సంఘాల నాయకుడు అన్నం సుబ్బారావు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రెడ్ క్రాస్ రక్తకేంద్రంలో పలువురు ఉపాధ్యాయులు, అన్నం సుబ్బారావు కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వెంకట హనుమకుమార్ 68వ సారి, బండా వెంకట కృష్ణారెడ్డి 11వ సారి, అన్నం కిరణ్ 20వ సారి రక్తదానం చేశారు.

## సి పి ఎం పార్టీ ఆధ్వర్యం లో రాజకీయ శిక్షణ తరగతులు



**కావలి, అక్టోబర్ 5,ప్రభారవార్త:** సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం సిపిఎం పార్టీ ఆఫీసులో జరిగినవి. ఈ తరగతులలో పార్టీ నిర్మాణం, సభ్యుల పని విధానం పై ఎం. మోహన్ రావు మతం మతోన్మాదం ప్రమాదంపై నగేష్ పార్టీ కార్యక్రమం పై జి. నాగేశ్వరరావు పాల్గొని బోధించారు. వీరు మాట్లాడారు పార్టీ సభ్యులు పార్టీ నిర్మాణానికి లోబడి పని చేయాలని పార్టీ సభ్యుల పని విధానం మెరుగుపరుచుకొని పార్టీ అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని తెలియజేశారు. మతం మతతత్వంతో ముందుకు వస్తూ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తూ భారత రాజ్యాంగాన్ని మార్పులు చేస్తూ దేశ ప్రయోజనాలను ప్రమాదంలోకి నెడుతున్న బిజెపి ప్రభుత్వ విధానాల పై ప్రజా పోరాటాల ద్వారానే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.పార్టీ శాఖలు ఎక్కడెక్కడ ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలను సమీకరించి పోరాటాలు కొనసాగించాలని కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు కార్మికులకు అండగా నిలబడి పోరాటాలను ముందుకు నడపాలని ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం ప్రజా పోరాటాలను కొనసాగించాలని కోరారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగించాలని రాబోవు రోజులలో సిపిఎం పార్టీ బలోపేతానికి పార్టీ సభ్యులు అందరూ తోడ్పడాలని పార్టీ ఇచ్చిన పోరాటాలలో కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ క్లాసులకు ప్రిన్సిపల్ గా టి. సుబ్బరామ శర్మ వ్యవహరించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, సీనియర్ నాయకులు ఎస్. వెంకయ్య, నాయకులు వై కృష్ణమోహన్ ,జి మధుసూదనరావు, సిఐటియు పట్టణ అధ్యక్షుడు పి.తిరుపాలు, మహిళా నాయకులు ఎం .శైలజ, సిహెచ్ .సుశీల,ఎస్.కె బీర తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవవధువుకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు సహాయ హస్తం

**– కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 వేలు పెళ్లి కానుక అందజేత**



**ఉదయగిరి, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం కొండాయపాలెం పంచాయతీ, మసాయిపేట గ్రామంలో షేక్ పీర్ అహ్మద్- షరీఫా దంపతుల కుమార్తె షేక్ సాజిన్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కాకర్ల చారిటబుల్ ట్రస్టు తరుపున నవ వధువుకు పెళ్లి కానుకగా రూ.10వేలు రూపాయలను అందజేశారు. ఈ సహాయాన్ని ట్రస్టు ప్రతినిధులు వధువు కుటుంబానికి వ్యక్తిగతంగా అందజేశారు. శాసనసభ్యులు కాకర్ల సురేష్ సేవా మనసుకు కృతజ్ఞతగా వధువు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కాకర్ల చారిటబుల్ ట్రస్టు తరుపున స్థానిక ప్రజలకు సహాయం చేయడం, సమాజంలో అవసరమైన వర్గాలను ఆదుకోవడం లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకర్ల చారిటబుల్ ట్రస్టు సభ్యులు జల్సా యాదవ్, హరీష్, గంగాధర్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఇకనైనా మారండి



**కోవూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలుగా, కేడీలుగా , అనుమానితులుగా రికార్డులకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సమాజంలో కలిసిపోవాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ అన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా ఈ పోలీస్‌స్టేషన్ రికార్డుల్లో ఉన్న వారు తమ తీరు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో వారికే ఇబ్బంది అన్నారు.మీ తీరు మార్చుకుని మారితేనే మీ బతుకులు బాగుపడతాయన్నారు. మారకపోతే ఈ పరిస్థితి ఇంతే అని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఉన్నారు.

## ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్



**కోవూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో అన్నార్థులకు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ పనులు దాదాపుగా పూర్తి కావడం జరిగింది. ఇక దీనిని ప్రభుత్వం ప్రారంభించడమే తరువాయి.. అన్ని హంగులతో చక్కగా రూపుదిద్దుకున్న ఈ అన్న క్యాంటీన్ ప్రతి ఒక్కరినీ ఆకర్షించే విధంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రూపొందించారు. త్వరలోనే ఈ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నారు.

## కార్పొరేషన్ సచివాలయ కార్యదర్శి కి సస్పెండ్ ఉత్తర్వులు

**నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 5,ప్రభాతవార్త:** నెల్లూరు కార్పొరేషన్ కు సంబందించిన 19/1 ఆనం వెంకటరెడ్డి నగర్ సచివాలయం సేవలలో విధులు పట్ల నిర్లక్ష్యం కనపరిచినందున కార్పొరేషన్ వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి షేక్. నాయబ్ ను కమిషనర్ వై.ఓ నందన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు శనివారం ఇచ్చారు. ఆదివారం ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు నిర్వహిస్తున్న ప్రభుత్వ లాగిన్ ను ప్రవేటు వ్యక్తుల ఇచ్చారని , ప్రభుత్వం సర్వీసులు దుర్వినియోగం అయ్యిందని మరొక సచివాలయం 25 / 3 సమతానగర్ వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి జి. హరికృష్ణ ఫిర్యాదు మేరకు పెండింగ్ విచారణ క్రింద తాత్కాలికంగా విధులు నుండి సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## వైకాపా సీనియర్ నాయకులను కలసిన మాజీ మంత్రి



**విడవలూరు,అక్టోబర్ 5 ప్రభాతవార్త:** మండలంలోని వరిణి పంచాయితీ వీరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బండ్ల వెంకయ్య, స్రవంతి నూతన గృహప్రవేశంనికి మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



**ఉదయగిఇ, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం ఆర్ఎస్ఎస్ విభాగ సంఘ చాలక్ పల్నాటి రామదండు హాజరయ్యారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటై 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శతాబ్ది కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. భారత జాతిని భారత ప్రజలను భారతమాత రూపంగా, భారతదేశాన్ని తన మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించడం ఆశయంగా డాక్టర్ కేశవ బలరాం హెగ్దే నా డాక్టర్ జి చేత 1925 వ సంవత్సరంలో విజయదశమి రోజు నాగపూర్‌లో స్థాపించబడిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటుంది. శతాబ్ది ఉత్సవాలకు కూడా భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలిపే దానిని ప్రణాళిక చేయడం ద్వారా భారత దేశ అభివృద్ధి పట్ల సంగ్ నిశ్శబ్దను తెలియజేస్తుంది.

## ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న కానిస్టేబుళ్లు అనిల్, కృష్ణ



**దగదర్తి, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** దగదర్తి పోలీసు స్టేషన్లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎన్.అనిల్ కుమార్, యువి కృష్ణ తన విధుల పట్ల ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం పొందినందుకు గాను ఎస్సై జంపని కుమార్, దగదర్తి పోలీసు స్టేషన్ సిబ్బంది ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. ఎస్సై జంపని కుమార్ మాట్లాడుతూ వీరు విధి నిర్వహణలో శ్రద్ధ చూపిస్తారని, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తారని తెలియజేశారు. ప్రజలకు ఏమైనా అవసరమై వస్తే వారికి తోడుగా ఉంటారని, అందరూ వీరులాగా కష్టపడాలని తెలియజేశారు.

## నివేశ్ బస్ యాత్రను ప్రారంభించిన కెనరా రోబెకో అసెట్ సంస్థ

**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త-విద్య** భారతదేశంలోని రెండవ పురాతన ఆస్తి నిర్వహణ సంస్థ అయిన కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో దాదాపు నెల రోజుల పాటు నిర్వహించనున్న పెట్టుబడిదారుల విద్యా కార్యక్రమం నివేశ్ బస్ యాత్రను నిర్వహిస్తోందని ఇందులో భాగంగా ఈ బస్సు నెల్లూరులో తన ప్రయాణాన్ని ప్రారంభించిందని కెనరా రోబెకో ఏఎంసి మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రజనీష్ నరులా తెలిపారు. నేటి ఆర్థిక రంగంలో, విజ్ఞానం అనేది అవగాహన వలె శక్తివంతమైనదన్నారు. తగిన సమాచారం ఉన్న పెట్టుబడిదారుడు తమకు తాముగా మెరుగైన నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా విస్తృతస్థాయిలో ఆర్థిక పర్యావరణ వ్యవస్థను కూడా బలోపేతం చేస్తాడన్నారు. కెనరా రోబెకో ఏఎంసి, సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ గౌరవ్ గోయల్ మాట్లాడుతూ ఆర్థిక జ్ఞానాన్ని ఆచరణాత్మకంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పెట్టుబడిదారులను శక్తివంతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్త ప్రతినిదులు పాల్గొన్నారు.

## పట్టణాలకు విస్తరిస్తున్న అమెజాన్ ఫ్రెష్

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 5, ప్రభాతవార్త** భారతదేశంలో 270కి పైగా పట్టణాలకు అమెజాన్ ఫ్రెష్ విస్తరించిందని, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, చిత్తూరు, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో ఈ సేవలు విస్తరిస్తున్నామని అమెజాన్ ఫ్రెష్ ఇండియా డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ తెలిపారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లడుతూ కేవలం రెండు సంవత్సరాల్లో 4.5 రెట్లు ఎక్కువ ప్రదేశాలకు చేరుకునే సామర్థం సాధించిందని,తాజా పండ్లు, కూరగాయలు, పప్పుదినుసులు, గృహావసర సామాన్లు, ఇంకా మరెన్నో రకాల వస్తువులతో సహా 40,000 లకు పైగా ఉత్పత్తులను సౌకర్యవంతమైన 2 గంటల డెలివరీ స్లాట్లలో పొంది కస్టమర్లు ఆనందించవచ్చని అన్నారు. గృహోవసరాలు, పండుగల్లో ప్రజలు మెచ్చే వస్తువులను గతంలో కంటే ఎక్కువ ఇళ్లకు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అమెజాన్ ఫ్రెష్ విక్రేతల నెట్‌వర్క్ విస్తరించిన కారణంగా, పట్టణాల వ్యాప్తంగా వారి ఉనికి పెరిగిన కారణంగా, దానితో పాటుగా అమెజాన్ అధునాతన డెలివరీ సామర్థ్యాల కారణంగా, భారతదేశంలో సర్వత్రా లభించే గ్రోసరీ నెట్వర్కును ఏర్పాటు చేయటం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత రఘురాంరెడ్డి మృతి



**బుచ్చి అక్టోబర్ 5 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని సాల్మాన్‌పురంకి చెందిన టిడిపి సీనియర్ నేత మల్లు రఘురామిరెడ్డి గుండె పోటుతో మృతి చెందారు. వివాదరహితుడుగా మంచి పేరు తెచ్చుకున్న రఘురామిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో తెలుగుదేశం నాయకులు పెద్దఎత్తున ఆయన ఇంటికి వెళ్లి రఘురామిరెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు. పార్టీకి రఘురామిరెడ్డి లేని లోటు తీర్చలేనిదని అన్నారు. పెద్దఎత్తున తెలుగుదేశం నాయకులు రఘురామిరెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వైఈఎస్ జనరల్ బాడీ సమావేశం

**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త-విద్య** ఆదివారం ఉదయం నగరంలోని స్థానిక బాల పేరయ్య కళ్యాణ మండపంలో యాదవ ఎంప్లాయి సొసైటీ ( వైఈఎస్ ) జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు . వైఈఎస్ జిల్లా అధ్యక్షులు నగల రవీంద్ర యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు సొసైటీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాదవ పేద విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని తెలియజేశారు. వైఈఎస్‌ను నియోజకవర్గస్థాయిలో , మండల స్థాయిలో గ్రామస్థాయిలోనూ విస్తరింప చేసి బలోపేతం చేయాలని సుచించారు. కాగా తొలుత సభ్యుల శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాలలు వెసి కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు గుమ్మడి శ్రీనివాసులు, ఎస్ వ్యవస్థాపకులు స్టేట్ ప్రెసిడెంట్ దామీనబోయిన వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి యనమల జానకి రామయ్య, అంబటి వెంకటేశ్వర్లు , మురళి,సుకుమార్,కాళ్ల వెంకటేశ్వర్లు,ప్రసాద్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాటంరెడ్డి కుటుంబం బహూకరణ

### - రూ. 3 లక్షలు విలువ చేసే కంకణం అందజేత



**కోవూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో స్వామివారికి ఇటీవల పుష్పయాగ కార్యక్రమాన్ని కాటంరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించి భక్తుల మన్ననలు కూ డా పొందారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి రూ. 3 లక్షలు విలువ చేసే బంగారు కంకణాన్ని కాటంరెడ్డి కు టుంబ సభ్యులు పెద్ద మనస్సు చేసుకుని ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంతాచార్యులకు ఈ కంకణాన్ని అందజేశారు. ఆయన దీనిని సీతామహాదేవికి ప్రత్యే కంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సంద˘ర్భంగా భక్తులు కాటంరెడ్డి కుటుంబం యొక్క సేవను కొనియాడారు.

## గ్రీవెన్స్‌డేకు అన్ని శాఖల అధికారులు హాజరు తప్పనిసరి



**కోవూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** ప్రతి సోమవారం కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు తప్పనిసరిగా తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలి పారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు హాజరైతేనే గ్రీవెన్స్‌డేకు వచ్చే ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి శాఖ అధికారి తప్పనిసరిగా ఈ గ్రీవెన్స్‌డేకు హాజరు కావాలన్నారు.

## సమస్యలను తెలియజేయండి పరిష్కారం చేస్తాం: తహసిల్దార్

**కొడవలూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** నేడు తహసిల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజావేదక పరిష్కార కార్యక్రమంలో మండల ప్రజలు పాల్గొని వారి సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని తహసిల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రీవెన్స్ డే ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

## టపాసులు దుకాణం పై దాడులు



**విడవలూరు, అక్టోబర్ 5 ప్రభాత వార్త :** వెంకట నారాయణ పురం గ్రామంలో టపాసులు దుకాణం పై ఆదివారం స్థానిక ఎస్సై నరేష్ వారి సిబ్బందితో దాడులు చేశారు. అను మతులు లేకుండా టపాసులు తయారు చేస్తూ దుకాణం గుట్టుచప్పుడు కాకుండా నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారని సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. దుకాణంలో 8 బాక్సులు టపాసులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు పరార్ లో ఉన్నాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

## కితకితలాడుతున్న ఆర్టీసి బస్సులు

### టికెట్ కొని కూడా నిలబడి పోవాల్సి వస్తుందని ఆవేదన

### నాన్‌స్టాప్ బస్సులు వేయాలని పలువురు ఆవేదన



**బుచ్చి అక్టోబర్ 5 ప్రభాతవార్త** ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిన్పటి నుండి ఆర్టీసి బస్సులు కితకిత లాడుతు కనిపిస్తున్నాయి. అయితే బస్సులో టికెట్ కొన్న మగవారు మాత్రం నిలబడి పోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా ప్రయాణం చేసే మహిళలు సీట్లలో కూర్చొని ఉండగా టికెట్ కొనుగోలు చేసిన మగవారు మాత్రం నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్త ం చేస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం వరకు నాన్‌స్టాప్ బస్సులు రెండు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆత్మకూరు నుండి నెల్లూరు డబుల్ స్టాప్ బస్సులు రెండు పూర్తి స్థాయిలో టికెట్ తీసుకొని ప్రయాణం చేసే విధంగా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సులో నుండి ప్రయాణికులు దిగలేకపోతున్నారని, అలాగే ఎక్కెందుకు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసి ఆర్‌ఎం,ఆర్‌టిసి డిఎం స్పందించాలని పలువురు కోరుతున్నారు. ఆర్టీబస్సులు ఆత్మకూరు బస్టాండ్‌లోకి వచ్చిన సమయంలో ఎగరి వెక్కడం,బస్సుకి వేలాడడం చేస్తున్నారు దీని వల్ల చాలా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆర్‌టిసి ఆర్‌ఎం స్పందించి కొన్ని నాన్ స్టాఫ్ బస్సులు వేయాలని కోరుతున్నారు.

## డాక్టర్ గంగాధర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి





**కోవూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** ఆయుష్ శాఖలో వైద్యాధికారిగా పనిచేసి అధికారుల మన్ననలు పొందిన డాక్టర్ గంటా గంగాధర్‌ను డాక్టర్లు ఆదర్శంగా తీసుకోవాలని నాలుగు జిల్లాల ఆయుష్ ఆర్‌డీడీ శేఖర్‌రాజు అన్నారు. నెల్లూరులోని ఏనుగు సుందర్‌రామిరెడ్డి కళ్యాణ మండపంలో ఆదివారం కోవూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ గంగాధర్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా ఆయుష్‌శాఖలో వైద్యాధికారిగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా , జిల్లా నోడల్ అధికారిగా పనిచేసి నిబద్ధతతో తనకు కేటాయించిన విధులు, బాధ్యతలను నిర్వహించారన్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ వైద్యుడిగా కూడా అవార్డులు అందుకున్న గంగాధర్ మంచి సేవలు చేసి పదవీ విరమణ చేశారన్నారు. విధుల పట్ల అంకితభావం, కరోనా సమయంలో ఆయన చూపిన చొరవ స్ఫూర్తి దాయకమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గతంలో ఇన్‌చార్జి ఆర్‌డీడీగా పనిచేసిన పద్మజాక్షి, వైజాగ్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ బాలకృష్ణ, తదితరులు పలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ గంగాధర్ దంపతులను ఘనంగా సత్కరించి సన్మానం చేశారు.

## జాతిపిత విగ్రహం ధ్వంసం చేసిన వైసిపి నేతలు





**చేజర్ల అక్టోబర్ 5 ప్రభాతవార్త** మండల కేంద్రమైన చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకుడు దేవతి సుబ్బారావు ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహన్ని వైసిపి నేతలు ఆదివారం మధ్యాహ్నం ధ్వంసం చేశారు .దీంతో బాధితుడు స్దానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. బాధితుడు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2014 సంవత్సరంలో చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో జాతిపిత మహాత్మగాంధీ విగ్రహాన్ని గ్రామ పెద్దలు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆద్వర్యంలో దేవతి సుబ్బారావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే వైసిపి నాయకులు ఆదివారం విగ్రహాన్ని జెసిబితో ధ్వంసం చేస్తుండడంతో సుబ్బా రావు విగ్రహన్ని ధ్వంసం చేయవద్దని బ్రతిమలాడినా వారు పట్టించుకోకుండా విగ్రహన్ని ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. ఇదే విషయాన్ని బాదితుడు స్దానిక తెలుగుదేశం పార్టీ నాయకుల దృష్టికి తీసుకొళ్లి వారిని ఆశ్రయించారు. బాధితుడికి తెలుగుదేశం నాయకులు అండగా నిలిచారు. సాక్షాత్తు జాతిపిత విగ్రహన్ని వైసిపి నేతలు ధ్వంసం చేయడంతో ఆగ్రహించిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఈమేరకు నిరసన తెలుపుతు ధర్నా నిర్వహించారు. జాతిపిత మహాత్మగాంధీజి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలంటు డిమాండ్ చేశారు. ఈవిషయం తెలుసుకున్న సంగం సిఐ వేమారెడ్డి,చేజర్ల ఎస్ఐ తిరుమలరావు ,సంఘటనా స్దలాన్ని పరిశీలించారు. తెలుగుదేశం నాయకుల్ని ఆందోళన విరమింప చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసినటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామి ఇవ్వడంతో ఆందోళన విరమిపం చేశారు. ఈవిషయమై స్దానిక ఎస్ఐ తిరుమలరావుని వివరణ కోరగా పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిరసనలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు షేక్ సిరాజ్దీన్, సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గోన్నారు.

## పెన్నా నదిలో ఇద్దరు యువకులు గల్లంతు






**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** నదిలో సరదాగా ఈత కోసం వెళ్ళిన ఇద్దరు యువకులు నదీ ప్రవాహానికి కొట్టుకుని పోయి గల్లంతైన సంఘటన నెల్లూరు రూరల్ మండలం దేవరపాలెం సమీపంలో పెన్నా నది వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కొత్తూరు శ్రీలంక కాలనీకి చెందిన నరసింహన్ అలియాస్ విశాల్ (19), తంగ వేలుకోటయ్య,విజయ్, లోకేష్ అనే నలుగురు స్నేహితులు ఆదివారం మధ్యాహ్నం పెన్నానదిలో ఈత కొట్టేందుకు దేవర పాలెం సమీ పంలోని పెన్నా నది వద్దకు చేరుకున్నారు. నలుగురిలో లోకేష్ మాత్రం ఒడ్డున ఉండగా మిగిలిన ముగ్గురు నదిలో దిగి ఈత కొట్టే సమయంలో నది ప్రవాహం అధికంగా ఉండడాన్ని సరిగా అంచనా వేయలేక కోటయ్య, విశాల్‌లు ప్రవాహానికి కొట్టుకొని పోయారు. విజ య్ ఒడ్డుకు చేరుకోగాలిగాడు. ఇద్దరు యువకులు గల్లంతైన విషయం వారి స్నేహితులతో పాటు అక్కడ నది ఒడ్డున నిలబడి చూస్తున్న కొందరు స్థానికులు గమనించి కేకలు వేశారు. అప్పటికే యువకులు ఇద్దరు నదిలో కొంత దూరం కొట్టుకుపోయారు. ప్రత్యక్ష సాక్షులు ద్వా రా మాచారం అందుకున్న నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తన సిబ్బందితో కలిసి యువకుల కోసం గజ ఈతగాల సహాయంతో తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు.సాయంత్రం సమయానికి విశాల్ మృత దేహాన్ని గుర్తించి ఒడ్డుకుచేర్చారు. మరొక యువకుడు కోటయ్య కోసం గాలింపు చర్యలు తీవ్రతరం చేశారు. తీవ్రంగా గాలించినప్పటికీ కోట య్య ఆచూకీ లభించకపోవడం రాత్రివేళ కావడంతో తిరిగి ఉదయం దాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. గల్లంతైన వారిలో నరసింహన్ ఇంటర్మీడియట్ చదువుతుండగా కోటయ్య కూలీ పనులకు వెళ్తుంటాడు. ఒకే ప్రాంతానికి చెందిన ఇద్దరుయువకులు నీట మునిగి గల్లంత కావడం వారిలో ఒకరు చనిపోవడం, మరొకరి ఆచూకీ తెలియకపోవడంతో శ్రీలంక కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

## నెల్లూరులో రోడ్డెక్కిన సచివాలయం ఉద్యోగులు

### - సభకు వెళ్తున్న ఉద్యోగులను అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 5, ప్రభాతవార్త** నెల్లూరు ఆదివారం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, నెల్లూరు టౌన్ హాల్‌లో సభ నిర్వహి స్తుండగా సభని అడ్డుకున్న పోలీసులు అనుమతి లేదంటూ ఒకటవ పట్టణ పోలీస్, సీఐ కోటేశ్వరరావు తెలపడంతో గ్రామ వార్డు సచివాల గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగస్తు లు టౌన్ హాల్ రోడ్డుమీద బైఠాయించారు ముందస్తు సభకు అనుమతులు తీసుకోలేదని కార్యక్రమాన్ని నిలిపి వేయడంతో పోలీసులతో సచివాలయ ఉద్యోగస్తులు వాగ్వాదానికి దిగారు, తమ సమస్యలు పరిష్కరించండి అంటూ, ఆందోళన చేస్తుంటే పోలీసుల అడ్డుకోవడం దారుణమని ఉద్యోగులు వాపోయారు. అన్ని రకాల సర్వీసులకు, ఉపయోగించుకుంటూ తమను వేధింపులు గురి చేస్తున్నారని, ఆందోళన వ్యక్తపరిచారు పోలీసులు తమ కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో టౌన్ హాల్ నుండి వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తపరిచారు.

## అక్రమంగా బాణసంచా నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

### - కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరిక




**ఇందుకూరుపేట, అక్టోబర్ 5, ప్రభాతవార్త** పోలీసు అనుమతులు లైసెన్సులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారు చేయడం, వాటిని నిల్వ చేయడం జరిగితే నిర్వాహకులు, సహాయకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఇందుకూరుపేట మండలం లోని నిడి ముసలి గ్రామంలో తుమ్మాలమ్మ తోపులో అనుమతులు, లైసెన్సులు లేకుండా బాణసంచా నిల్వలు చేస్తున్నారన్న ఫిర్యాదులు అందడంతో కోవూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బాణ సంచా తయారీ నిల్వలు చేస్తున్న ఇద్దరు యేసు రత్నం రవి అను వారిని గుర్తించారు. సీఐ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా తెలిసి తెలియకో బాణసంచా నిల్వలు చేసినట్లయితే వారి ప్రవర్తన మానుకోవాలని హెచ్చరించారు.బాణసంచా తయారీలకు సంబంధిత అధికారుల నుంచి లైసెన్సులు అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో సీఐతో పాటు ఇందుకూరుపేట ఎస్సై నాగార్జునరెడ్డి, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ ముందరపొట్టెమ్మ తల్లి, శ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవము





**కావలి, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** కావలి మండలం, అన్నగారి పాలెం సమీపాన వేంచేసి ఉన్న అమ్మలగన్నమ్మ శ్రీ శ్రీ శ్రీ ముందర పొటట్టెమ్మ తల్లి,దేవత సహిత శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవము ఈనెల 17వ తేదీ శుక్రవారం నుండి 19వ తేదీ ఆదివారం వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగునని ఆలయ కమిటీ సభ్యులు, తుమ్మలపెంట పంచాయతీ, అన్నగారి పాలెం పంచాయితీ గ్రామాల పెద్దలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం తిరునాళ్ళకు సంబంధించిన కరపత్రాలను అమ్మవారి సన్నిధిలో ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు ఈనెల 17వ తేదీ శుక్రవారం ఓటురు గ్రామస్తులుచే అమ్మవారికి పూల అలంకరణ జరుగునని తెలియజేశారు రాత్రి పది గంటలకు శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి నాట్యమండలి అన్నగారి పాలెం యాదవులవారి చే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర పూర్తి నాటకం ప్రదర్శించబడునని తెలియజేశారు. 18వ తేదీ శనివారం ఒట్టూరు గ్రామానికి చెందిన వెయ్యల శ్రీనివాసులు అమ్మవారికి పూల అలంకరణ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అన్నగారి పాలెం వారిచే గంగ పెట్టెలు బొల్లి ఆవులు వీరంగంతో అమ్మవార్లకు ఉత్సవములు అత్యంత వైభవంగా జరుగునని తెలియజేశారు రాత్రి 10 గంటలకు చింతామణి పూర్తి నాటకం, సత్య హరిచంద్ర (వారణాసి, కాటిసీను) ప్రదర్శించబడునని తెలియజేశారు. 19వ తేదీ ఆదివారం వెంకటేశ్వరపురం, లక్ష్మీపురం గ్రామస్తులచే అమ్మవారికి పూల అలంకరణ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఉదయం 10 గంటలకు నెల్లూరు హ్యాపీ ఆర్కెస్ట్రా వారిచే గొప్ప సినీ పాట కచేరి జరుగునని తెలియజేశారు. మధ్యాహ్నం వెంకటేశ్వరపురం లక్ష్మీపురం గ్రామస్తులుచే అన్నదాన కార్యక్రమం జరుగును అని తెలియజేశారు. భక్త మహాసేయుల్లరు తమ శక్తి కొలది అమ్మవారికి విరాళాలు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేశారు. భక్తులు ప్రజలు సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసి తిరునాళ్లల్లో పాల్గొని శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి శ్రీ గంగమ్మ తల్లి ల కృపకు పాత్రులు కావలసినదిగా కోరడమైనదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తుమ్మలపెంట పంచాయితీ, అన్నగారి పాలెం పంచాయితీ ల గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.